
కథ

# రాగాల చెట్టు



గంటేడ గౌరునాయుడు



రాగాల చెట్టు. తొలిపొద్దు వెలుగులో కరిగిన బంగారంలా కదలిపోతున్న కొండవాగు ఒడ్డున, పలుచని సన్నని దారాల్లా ఆకులుగాలితాకిడికి కంపించి ప్రతి కదలికా ఒక పదమై పలికే రాగాల చెట్టు. చెట్టు మొదట్లో ఓ కొయ్య.




కొయ్య చివర వాడిగా చెక్కివుంది బల్లెంలా. ఆ కొయ్యకు.. గొడుగులా ఇంటి కప్పుకు నేత నేసినట్టు ఆరిక గడ్డి నేత. గిరిజన గూడేల్లో ప్రతి చోటా కనిపించే ఆ కొయ్య గిరిజనులు నమ్మే దేవతకు గుర్తు. చెట్టు చుట్టూ ముళ్ళ కంపలతో ఓ కంచె. కంచె ననుసరించి రంగురంగుల పూలమొక్కలు. చెట్టు మొదట్లో ఎవరైనా కూర్చునేందుకు అనువుగా పేర్చిన రాళ్ళు.

గూడ జనాలకు దేవత ఆచెట్టు. కొండాకోదన్నలకు బతుకుపాటల్ని వినిపించేది ఆ చెట్టు. మనసును తాకి.... మరో లోకానికి తీసుకుపోయే చెట్టు. రాగాల చెట్టు. వినగలిగే మనసుకు గాలి అలల్లో పక్షుల కిలకిలలు నేపథ్యసంగీతంగా చెట్టు కొమ్మల సందుల్లోంచి జ్...జ్...జ్...జ్.. మంటూ జాలువారే వింత శబ్దాలు మనసు గోడలను తాకి పాటలుగా అనువదించబడతాయి. ఆ గూడ జనం అన్ని ఉదయాలూ, సాయంత్రాలూ అక్కడ చేరి ఒక పాటైనా వింటారు. స్ఫూర్తిని పొందుతారు. బ్రతుకును పాటగా మలచుకుంటారు.

లేత ఎండలో నీళ్ళకు వచ్చి మట్టికుండ ఒడ్డున పెట్టి ఆ చెట్టు దగ్గరికి వెళ్ళి రాతి మీద కూర్చుంది ఓ గిరిజన స్త్రీ. నెలలు నిండిన కడుపుతో వుందేమో.... నడిచొచ్చిన చిన్న కొండలా వుంది. అక్కడ చెట్టును ఆనుకుని పిల్లంగోవి వూదుతున్నాడు ఓ ముప్పయ్యేళ్ళ సవర యువకుడు.

సిగురేసిన సెట్టమ్మా........పాట
కెరటాల గెడ్డమ్మా ........ పాట
ఉలికించే వూపమ్మా...... పాట
ఊరికి వూపిరిమ్మా ........ పాట
సావులేని దమ్మపాట సారమైనదీపాట .....

అలలు అలలుగా తేలుతోంది పాట. తేనె వానలా జాలువారుతోంది పాట. వెన్నెల సోనలా కురుస్తోంది పాట. ఆ యువకుడు పిల్లంగోవితో పాడే ఆ పాటేదో అందరికీ పరిచితమే. ప్రతిపదమూ వారిపెదాలపై ఆడినదే..... పదహారేళ్ళ బ్రతుకు పాటల్ని కళ్ళ ముందు ఆవిష్కరింప జేస్తున్నది, ఆ పాట......

లోన మురా

ఏజెన్సీ ముఖద్వారం అనదగిన..... పట్నం కావడానికి ఆరాటపడుతున్న చిన్నసైజు కొండచిలువ లాంటి పెద్ద పల్లెటూరది. కొండలమీద కురిసిన వాన పల్లానికి ప్రవహించి చెరువుల్లో నిండినట్టు. కొండఫలం కాటాలోంచి జారి సంపదగా మారి కాంక్రీటు వనాలు విస్తరిస్తున్న ఊరది. ఆ వూరు దాటేక ప్రధానరహదారి నుండి విడివడి ఎడమ వేపుగా వెళ్ళే ఓ పాడు పడిన రోడ్డు.

ఓ పాతికేళ్ళ యువకుడు ఉంగరాల జుత్తున్నవాడు బొంగరాల బుగ్గలున్నవాడు కాదుగానీ చూడచక్కని వాడే. పేంటు....లాల్చీ వేసుకున్న వాడు.... భుజానికి వేలాడే సంచీలో గలగలలల శబ్దంతో ఓ కంజీరా. ఆ గతుకుల రోడ్డులో నడిచిపోతున్న ఆ యువకుడు కొంత దూరం వెళ్ళేక రోడ్డువార ఓ రాళ్ళ కుప్పను చూసి ఆగేడు. ఆగి తుప్పనుండి గుప్పెడు ఆకులు దూసి చుట్టూరా పేర్చివున్న రాళ్ళనడుమ... ఏదో దేవత బొమ్మ చెక్కివున్న రాతిమీద వేసేడు. రెండు చేతులు జోడించి.... "అమ్మా మాలతమ్మ తల్లీ చల్లగ చూడుతల్లీ దొరక్కదొరక్క దొరికింది... ఉత్తరాలు పంచే ఉద్యోగం..... కొండల్లో తిరగాలి... కొండ దేవతవు నువ్వు.... కరుణతో చూడుతల్లీ..." అని దండం పెట్టి... మళ్ళీ నడక సాగించేడు.


ఎత్తుగా... గంభీరంగా కండలు తిరిగిన కోదన్నల్లా అమాయకంగా చుట్టూరా ఆవరించి వున్న కొండల్ని చూసేడు. నడక శ్రమ తెలీకుండా వుండేటందుకు కంజీరా తీసి మెల్లగా వరసలు వేస్తూ ఓ పాట అందు కున్నాడు.

రేలా.......... రేలా........
తల ఎత్తి నిలబడ్డ కొండను సూడు
బతుకు నిచ్చు బూఁవి తల్లి గుండెను సూడు
సామ జొన్న గంటి కంది సేలు సూడు
కొడవళ్ళలాంటి కొర్ర ఎన్నులు సూడు
అరటి గెల అందం సూడు...
పనసపళ్ళ పసందు సూడు...
కొండా వాలుల జాలుల్లోన పోడు పంటల పొందిక సూడు....॥

కొండల మీద ఎండపడి మెరుస్తోంది. పాట కొండవాగులా పరుగులు తీస్తోంది. పెదాలు విడిచే పదాల వెనక దారి క్రమంగా తరిగిపో తోంది. పొద్దు నడినెత్తికి వచ్చేసరికి ఓ వాగు దగ్గరికి వచ్చేడు. ఒడ్డున నిలబడి చూసేడు. వాగుకు అవతల కొద్ది దూరంలో ఓ బిల్డింగ్. అక్కడ పిల్లలు కొందరు తిరుగాడుతూ కనిపించేరు. "అదే గావాలిబడి" అనుకు న్నాడు. గెడ్డ ఒడ్డున పశువులు కాసే కుర్రాళ్ళు కనిపించేరు. ఒక కుర్రాడు పిల్లంగోవి వూదుతున్నాడు. మరో కుర్రాడు ఆకు సన్నాయితో 'పీ.....పీ' అంటూ పిల్లంగోవితో పోటీ పడుతుంటే. యింకో పిల్లాడు భుజాన వున్న చిన్న గొడ్డలి కాము మీద కట్టెపుల్లలతో దప్పుదరువులు వేస్తున్నాడు. ఆ దరువులకు వాళ్ళలా ఎగురుతుంటే వాళ్ళ నడుములకు వేలాడే గోచీలు చిత్రంగా ఆడుతున్నాయి.

ఆ కుర్రాళ్ళు యీ యువకుణ్ణి చూసేరు; చూసి నెమ్మదిగా దగ్గరికి వచ్చేరు. యువకుని చేతిలోని కంజీరాను చూసేరు. 'ఇదేంటో ?' అన్నట్టు కంజీరాను తాకి ఒకరిముఖాలోకరు చేసుకున్నారు. ఆ యువకుడు నవ్వి నీళ్ళలోకి దిగి ముఖం కడుక్కుని నీళ్ళు త్రాగి ఆ నీటిలోనే ఓ బండమీద కూర్చున్నాడు. కుర్రాళ్ళను నవ్వుతూ చూసి కంజీరా మీటేడు. గుండెను మీటినట్టు. పిల్లంగోవి వూదేడా పిల్లడు మనసును తాకినట్టు. కట్టెపుల్లల దప్పుదరువులు అందుకున్నాడు మిగిలిన వాడు.. కాలాన్ని కట్టి పడేసినట్టు.

గెడ్డనీటి అలల సవ్వడి తుడుం మోతలా వినిపిస్తుంటే, కంజీరా పిల్లంగోవి వాయిద్యా లకు కర్రల దరువులు తోడై కొండా..కోనా....వాగూ....వంకా.... తుప్పా....




డొంకా...., చెట్టూ చేమా... రాయీ రప్పా.... ఆ సంగీత ప్రవంతిలో ఓలలాడేయి.

యువకుడు కంజీరా సంచీలో పెట్టేడు.

కుర్రాడు పిల్లంగోవి ఆపేడు...

కర్రల దరువులు ఆగేయి..

ప్రకృతి ఊపిరి పీల్చుకుంది.

అంత మంచి సంగీత విద్వాంసులు తన నేస్తాలైనందుకు పులకరించి కరిగి కరిగి ఆనందమై ప్రవహించింది కొండ వాగు.

కుర్రాళ్ళ మధ్య మాటలు జరిగేయి. స్నేహ హస్తాలు కలిసేయి. చెలిమి కబుర్లు సాగేయి. కబుర్లతో గెడ్డ దాటుతున్న నేస్తాలకి ఓ తెల్లదుస్తుల వ్యక్తి ఎదురయ్యేడు. సైకిలు వెనక కేరేజిపై కూర్చున్న ఆ వ్యక్తి దిగి బండి వాడిని కేకేసి చేప్పేడు... "సగం..అన్నానని చెప్పు." అని. ఆ వచ్చిన వాడికి యింకేదో నెమ్మదిగా చెవిలో చెప్పి.... గెడ్డ దాటేడు. అలా గెడ్డదాటుతూ తనను పరిశీలనగా చూడ్డం గమనించేడా యువకుడు .

"సెంద్రన్నా అడు యీ వూరి బడిల మేస్టు.... మేస్టరే గాని ఎవులికీ ఒక అచ్చరం ముక్క సెప్పిన పాపాన పోనేదు. దుమ్మలగుండువాటాం. ఇప్పుడు బియ్యం బస్తాలు బండిలో ఎల్తన్నాయా.... సకం అన్నాడు యిన్నావు గదా ఆ స్టలుకి తెచ్చిన బియ్యం అవి... యీడింటికి సకమెలి పోతాయి?" తెల్ల గుడ్డల వ్యక్తిని కసిగా చూస్తూ అన్నాడు పిల్లంగోవి కుర్రాడు సోదన్న.

"మా మందరము అదా ఆ బడిలోనే సదివీవోలిమి. నాను ఆరు. సోదన్న నాకంట ముందే ఆరు పేసెక్కి వుండిపోనాడు..... యిద యీ బుదగాడు ఐదు. మమ్మల్ని బడిమాని పించీసి ఒక్కలికి పంపించీమని మా అయ్యాల్తో టి సెప్పినాడు యీ నంజికొడుకే. మల్లి యీడొక గురువట గురువు" కసిగా చూసేడు కర్రల దరువేసిన సంగమేసు.

"బడి గుంటల్ని పొలానికి తీసికెల్లి పనులు సేయించుకుంటాడు పనికెల్లపోతే బాదీడిమే. యీ సిందవగాడి ఎనకాల తిరుగుతాడొకడు.... వరడనాగ.... ఆడొక గురువు... ఆడు అదా ఆకొండ కనబడతందిగదా... ఆకొండ మీద వూరిల ఆడి వుజ్జోగం. ఆడెప్పుడూ ఆ కొండెక్కినట్టు తెలీదు. ఎప్పుడూ యీ తిరపతయ్య మేస్టు ఎనకాల తిరిగితేనే సరిపోద్ది. అస్టలు బెల్లు యినబడితే సాలు బుక్కడాకి తయారైపోతాడు కేరేజి కప్పుతోటి. తిరపతయ్యగాడి పోలాన పని, అస్టల్లతిండి, ఆడిపేరు గంగయ్య." బుధగాడు చేప్పేడు... ఒకసారి తను పొలానికి పనికిరానంటే తిరపతయ్య... గంటయ్యచేత కొట్టించిన దెబ్బల్ని గుర్తు చేసుకుంటూ.

తిరపతయ్య మేష్టారి కథంతా పూసగ్రుచ్చి నట్టు చెప్పేరు వాళ్ళ మాటల్లో. ఊరు పరిస్థితిని కళ్ళముందుంచేరు. చంద్ర తన ఉద్యోగం గురించి చెప్పేడు. అందరూ ఊళ్ళోకి వచ్చేరు.

హాస్టల్లో భోజనాలైనాయేమో.. బోరింగ్ దగ్గర పిల్లలు పళ్ళాలు కడుక్కుంటున్నారు. పిల్లలు కొద్దిమందే వున్నట్టున్నారు. సోదన్న తనతో ఇంటికి తీసుకెళ్ళేడు చంద్రాన్ని.

"సెంద్రన్నా... యీ బువ్వ తినగలవా...' ' కొర్రబువ్వ సత్తు పళ్ళెంలో తెచ్చేడు.

"ఏమి.. తినకపోడానికి నేనేం మారాజు బిడ్డనా.... మంచోడివే.." కొర్రబువ్వ కడుపు నిండా తిన్నాడు చంద్రం.

ఉత్తరాలు పంచే ఉద్యోగంలో చేరిన చంద్రం ఆరోజు నుంచీ 'ఉత్తరాల బావు' అయ్యేడు. ఉత్తరాలు పట్టుకుని గూడలు తిరుగుతుంటే చదువురాని గిరిజనులు కార్డు చదవడానికి కందులో....చింతపండో.... ఏదోఒకటి యివ్వడం ఆశ్చర్యం కలిగించింది. తాను వద్దన్నాడు "అదేటి వుత్తరాలబావ్ ముందున్న బావు అడిగి తీసుకునేవాడు.

నువ్వేటిలగ సెట్టు నుండి జీలుగు దింపించి... తాగి గాని కదిలీ వోడుగాదు తెలుసునా' అనేవారు. వారికి వివరంగా అన్నీ చెప్పేవాడు. గిరిజనులకి ఆటపాట బాగా యిష్టమని గమనించేడు. వారి బ్రతుకు... బ్రతుకులోని బాధ.... అర్థం చేసుకున్నాడు..... 'పాటతో ఏ విషయం చెప్పినా వింటారు... పాట కట్టడం...పాట పాడటం సరదా అయిన తనకి... అదిప్పుడు బాగా ఉపయోగపడుతుంది. అమాయకులైన కోదన్నలకు పాట ద్వారా ఎన్నైనా చెప్పొచ్చు' అనుకున్నాడు.

నేస్తాలు చంద్రం పాటకు ప్రచారకులయ్యేరు ఆరాత్రి.... ఊళ్ళో చంద్రం పాట ఏర్పాటయ్యింది.


కొండమీద కోదోళ్ళో ...కూడేలేని పేదోళ్ళో
మాయా మర్మమెరగని సవరోళ్ళో జాతాలో గదబోళ్ళో
సింతపండు కావుళ్ళతో కొండాదిగుతుంటే
బరువులు మోసి భుజం కాయలు కాస్తుంటే
కార్పోరేషను కళ్ళుగప్పి.... దళారోడు దారికాసి
సరుకు బేరమాడుతాడు ఓరయ్యో...
**వర్షీ కింద జమకడతాడు ఓరయ్యా......॥**

...... ...... ..... ......... .......... .........

దశమి నాటి చంద్రుడు వెన్నెలను మంచుతో మేళవించి పల్చని తెల్లని తెరలా... నేలమీదికి జారుస్తున్నాడు. చుట్టూ కొండలు విశ్రమించిన ఏనుగుల్లా.... కొండల మీద పాకల్లోంచి పోడుపంటల్ని కోతులనుండి రక్షించుకోడానికి కాపలా కాస్తూ కోదన్నలు చేస్తున్న శబ్దాలు మంద్ర మంద్రంగా వినిపిస్తున్నాయి.

కొండమొగలో రెండేరెండు వీధులు. లక్క పెట్టెల్లాంటి ఇళ్ళునల్లమెరుగు మట్టితో అలికిన గోడలు... గడపల అంచులకు జేరుగు.... ముగ్గులతో కళాత్మకంగా తీర్చిదిద్దినట్లు వెన్నెల్లో పాడుతున్న సవర పడుచుల్లా వున్నాయి. విశాలంగా వున్న ఆ వీధిలో మంటపెట్టిన పెద్ద దుక్కలు గాలికి రవరవ రాజుకుంటున్నాయి. కుంపట్ల ముందు చలి కాచుకుంటూ... చంద్రం పాడుతున్న పాటలో లీనమైపోయేరు.. అక్కడి జనాలు చలిని మంచును లెక్కచెయ్యకుండా. గాలికి రాజుకుంటున్న ఎండు దుక్కల్లాగా పాటకి రాజుకుంటున్నాయి వారి మనసులు.

కొండల్లో కోదన్నల కష్టాల్ని పాటలుగా పాడేడు. వారి బ్రతుకుల్ని వారి కళ్ళకు కట్టినట్టు వర్ణించేడు.
పాటతో ఆపేటవాడయ్యేడు చంద్రం.



పాట ఆగూడలో ఓ గూడు అయ్యింది. పాట ఆ గూడెపోళ్ళకు ఓ తోడు అయ్యింది. ఆగూడెంలో డప్పు తుడుం మోగని రాత్రి తెల్లవారదు. ధింసానృత్యంతో దుమ్మురేగకుండా పొద్దుపొడవదు. పండగల్లో, వెన్నెల రోజుల్లో గిరిజనపడుచులు ఒకరినడుం ఒకరు పట్టుకుని ముందుకు వెనక్కు వూగుతూ... పరుగులు తీసి ఆడే ఆ 'ధింసానృత్యం' కొండలనడుమ వెండి వెన్నెల్లో అదొక అపురూప దృశ్యం. దానికి మరో మనోహర దృశ్యం కంజిరా పాట తోడయ్యింది. చంద్రం యిప్పుడు గూడెంలోని వాడు కాదు..... గూడ మనుషుల గుండెల్లోని వాడు. చంద్రం పాట యిప్పుడా అమాయక గిరిజనులకు ఓ బ్రతుకు బాట.

"తెల్ల గుడ్డలోల్లొస్తే తెల్లబోయినారు
ఖాకి బట్టలోలొస్తే కంగారైనారు
జంతువుకే ఏనాడు జంకని మీరు
చదువు లేక మనిషి కాడ లొంగిపోయినారు..
అమ్మా ఓయమ్మా మా యమ్మలారా...
అన్నా ఓ యన్నా మా యన్నలారా...
అందుకే.....
కొండదిగొచ్చి చదువుకోండి.... .......!

తను చెప్పాల్సింది పాటతో చెప్పేడు. చెయ్యాల్సిందేదో పాటతో సూచించేడు. కొండలన్నీ తిరిగేడు కొండ బ్రతుకు చూసేడు. కొండ జీవితాన్ని చదివేడు. కోదన్నల బ్రతుకుల్ని పాటలు కట్టేడు. గతంలో జరిగిన పోరాటం ఆ నెత్తుటి గాథలు.. కొండల్లా చలించని.... ముసలోళ్ళు చెబుతుంటే విని చలించిపోయేడు. "కొండల్లో కోయిలలే కొత్తపాటలు పాడాల" అంటూ కొత్త పాటలు వినిపించేడు. తమ బ్రతుకుల్ని పాటలుగా విన్న ఆ కోదన్నల్లో ఏదోతెలియని ఉత్సాహం పరవళ్ళు తొక్కింది.

ఊరి నుండి వచ్చిన తిరపతయ్య మాష్టారికి ఊళ్ళో ఏదో కొత్తగాలి వీస్తున్నట్లనిపించింది. కొత్త దనమేదో గడపగడపకీ.. పులుముకున్నట్లుంది... నెలకు పైగా తను వూళ్ళో లేకపోవడం వల్ల యిలా అనిపిస్తుందా' అనుకున్నాడు. బడి వేపు వెళ్తే కొత్తగా కనిపించింది. బడి పిల్లల్తో కళకళలాడుతూ.

"వార్డెన్ గారూ.. ఏంటి కథ.." అన్నట్టు చూసేడు తిరపతయ్య మాష్టారు వార్డెన్ ముఖంలోకి.

"ఇదంతా పోష్టు రన్నరు చంద్రం పని. వాడు ఉత్తరాలు పంచడానికి వెళ్ళినవాడు డప్పొకటి తీసుకెళ్తున్నాడు. గూడలన్నీ తిరిగి పాటలు పాడి అందర్నీ చదువుకోమని చెప్తున్నాడు. మనం బడినుండి తగిలేసి గుంటలందర్నీ కొండలెక్కి, బండలెక్కి తీసుకొస్తున్నాడు" విషయం వివరించేడు వార్డెన్. ఆలోచనలో పడ్డాడు తిరపతయ్య మాష్టారు. పాటలతో మారుమ్రోగి పోతోంది ఊరు. పక్షుల అరుపుల్తో జాగృతమయ్యే అడవిలాగా.

పశువుల వెనకాల పాట
పోడు పనుల్లో పాట
జీలుగరెమ్మల్లో... నిప్పల కొమ్మల్లో పాట

తిరుపతయ్య మాష్టారికి పాట తూటాలా తగులుతోంది ఎటువెళ్ళినా. ఆ వూరి గాల్లో పాట పిట్టలా ఎగురుతోంది. తిరపతయ్య మాష్టారి ముఖం ఉడికిన ఎర్రపెండలం దుంపలా కమిలిపోయింది. కసిగా పళ్ళు నూరేడు. ఆ రాత్రి గ్రామస్తులందరినీ సమావేశపరిచేడు. 'వాడెవుడు... పోష్టు బంట్రోతు. వాడికి తెల్సిందేటి వాడు చెప్పేదేటి ? వాడికొచ్చిన జీతం చాలక ఊరూరు తిరిగి పాటలు పాడుకుని కందులో, కొర్రలో కూడేసుకునేవాడు. అసలు మీకిది తెలుసో లేదో... వాడు నక్సలైట్ల మనిషి. పోలీసులు వాడికోసం తిరుగుతున్నారని అనుకుంటున్నారు కూడా.. సరదాకి సమర్థాడితే.. సొకల్దాయికొక తీసుకున్నట్టు.. పాట చెప్తున్నాడని సరదాపడతున్నారు గానీ... ఆ తరువాత

రాబోయే దాన్ని కానుకో లేకపోతున్నారు.. అనవసరంగా యిరికిపోతారు నుమా అయినాక నేనేరావాల..." బాణం వదిలేడు. అంతా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. సాంబరో తాత అన్నాడు కొంచెం దైర్యం చేసి.

"ఏటిగురువా... ఆడేటి సేసినాడు. ఆడికి తెలిసిన.. ముక్కలు సెప్తున్నాడు. జొన్నకూడైతే జొన్నకూడు గంటిజావైతే గంటిజావ. ఆపూటకి... ఏది కలిగితే అవి కడుపుల పోసుకుంతన్నాడు. ఉత్తరాలు యివ్వడాని కెల్లి... బడి మానీసిన గుంటల్ని తీసు కొత్తండు. బడిల కూకోబెడతండు. అదేనేటి తప్పు. సూడిమీ గుంటలు నున్నగ నూనగోరల్లాగ నిగనిగ లాడతండ్రు". అని ఓ హాస్టలు కుర్రాడిని చూపించేడు "యింతకు మునుపు యిలగే వుండీ వోలా గుంటలు"

ఆ వెంటనే మరో యువకుడన్నాడు జనం లోంచి "ఎలాగూ మమ్మల్ని సదవకుంట సేస్సినావు. ఈ కొండల్ల బండల్లాగ మార్సీసి దరమ్ము కట్టుకున్నావు. ఆకుని అందక పోకని పొందక మద్దినైపోనాం.. సదువు సెప్పడాని కొచ్చినోడివి సవర దాన్నుంచుకొని కొండోల తోటి సుట్టరికం కలుపుకోని... మావోలందర్నీ నీ కంబారోల్లాగ సేసుకున్నావు. మాం సదివితే నీకెక్కడ అన్నేయమైపోద్దో అని మా గుంటల్ని బడి కెల్ల కుంట సేస్సినావు. ఎంది... సదువు సెప్పప్పాయినా నీ జీతం నీకు ఎలిపొస్తంది గాదా. మామేటి నీకు యిన్నాలూ అడిగి నామా ఇప్పుడు నీకేటైపోయిందని మీటింగెట్టి నావు.. మా కొకపాట, మాట వస్తందంటే ఆ బావు దయే గదా. ఏదైతే అదవ్వనీ.. సెంద్రన్న యిక్కడే వుంతాడు. మాతోటే వుంతాడు."

ఉన్నట్టుండి కొండమీంచి ఓ బండ దొర్లి మీద పడ్డట్టయ్యింది. తిరపతయ్య మాష్టారికి. కొద్దిగా వణికేడు. "ఎప్పుడూలేనిది యిప్పుడిలా ముందు నిలబడి మాట్లాడుతున్నారేటి" అనుకున్నాడు.

"సరేన్రా.. మీ అందరికీ యిష్టమైతే నాకేనా.. సరే.. అయినాక అయొచ్చినా పయొచ్చినా నా పూజీలేదు... ఆ .."

"అదేటి గురువా.. కోపం సేత్తావేల.. యిప్పుడే టైనాది. నీకు కాదనీ సిందేటి?" ఓ ముసలమ్మ అనునయంగా అంది.

"ఒలే... ముసిలీ... నువ్వు పల్లకోయే ఆడికి సేమాకు రాయక్కర్నేదు" ముసల్దాన్ని కసిరే సాడు.

విసురుగా లేచి ఇంట్లోకి వెళ్ళిపోయేడు తిరపతయ్య.

కుర్రాళ్ళ పెదాలపై నవ్వులు విరిసేయి. నవ్వులతో పోటీ పడుతూ వెన్నెల నేలకు జారింది.

★ ★ ★

రాళ్ళను ఒరుసుకుంటూ ప్రవహిస్తున్న వాగునీళ్ళ సంగీతం వింటూ ఏవో కొత్త బాణీలు వెతుక్కుంటున్న చంద్రం తలెత్తి చూసేడు. ఎదురుగా సిరిమెల. తిరపతయ్య మాష్టారి మరదలు. పద్దెనిమిదేళ్ళ వితంతువు. మొగుడి చావుకి కారణం తిరపతయ్యేనని చాలమందికి తెలుసునని సిరిమెలకి తెలుసు. తనను మెత్తబెట్టి ఉంచుకోవాలనుకుంటున్న తిరపతయ్యను, దూరంగా వుంచడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించాలని మాలతమ్మ తల్లికి మొక్కుకుంటుందెప్పుడూ..

"నువ్వా.." చుట్టూ చూసేడు

నిండుగా నిలబడ్డ కొండలు పచ్చగా తళతళ మెరిసే ఆకులతో ఎత్తుగా చెట్లు.... తమ ఔన్నత్యాన్ని చాటుతూ. అడవి తల్లి పాదాలకు మువ్వల పట్టీలా... ఒంపు తిరిగిన వాగు. కిలకిలా రవాలతో వింత బాసల్లో కొత్త గీతాలు ఆలపిస్తున్న పక్షులు. కాయలు పగిలి గాల్లో తేలియాడే బూరుగ దూదిలా కొండ కోన మీద తేలియాడే తెలతెల్లని మబ్బులు.

కొండమల్లెలు జలజలా రాలినట్లు నవ్వింది సిరిమెల.

" పాట పాడవా... "

"ఎవరైనా చూస్తే బాగుండదు. అసలే మీ బావకి నేనంటే కోపం"

"పరవానే, ఆడేటి నన్ను మనువాడినాడా..'

"మీ బావంటే భయం లేదా..."

"బయమా - కొండలకీ, కొండల్లపుట్టిన కొండోలకీ బయమేమిటి ?"

"ఆహా.. అలగా...'

"అలగా లేదు జలగా లేదుగానీ పాడుదూ... నీ పాటంతే సర్దానాకు"

"రాత్రికి పాడతాను గదా వీధిల... ఎలాగూ మీ బావలేడు... అన్నట్టు మీ బావ మీద పాటకట్టి పాడమంటావేటి.."

"అలగే పాడుదువుగాని... యిప్పుడొక సిన్నముక్క పాడీరాదా. సెల్లిలా... సెల్లిలా.. అని పాడినావు గదా అల్లా మొన్న అది పాడుతూ" తప్పుదన్నట్టు కంజిరా తీసేడు.

"సెల్లెలా... ఓ సెల్లెలా. కొండమల్లెపువ్వానా సెల్లెలా....

జాగర్త జాగర్త సెల్లెలా.... నీ బతుకు జాగర్త సెల్లెలా....

నీటుగా వస్తాడే సెల్లెలా... ఆడు నోట్లు సూపెడతాడే సెల్లెలా...

నీతు లెన్ని సెపుతాడో సెల్లెలా... ఆడు గోతులన్ని తీస్తాడే సెల్లెలా

సేతిలోన సెయ్యేసి బాసలెన్నో సేస్తాడు

సక్కనోడు అనుకోకు సెల్లెలా...

ఆడునక్కకన్నా మాయలోడే సెల్లెలా..... ॥

వాగు నీళ్ళ చప్పుడు...కంజిరా దరువులు ప్రక్కవాయిద్యాలుగా పాట పరవళ్ళు తొక్కింది. ఆ సాయంత్రపు గాలిమేనాలో పాట వూరేగింది. పాట వింటూ సిరిమెల బండల్లో తానూ ఒక బండ అయ్యింది. ముఖం మీద నీళ్ళు పడి ఉలిక్కి పడి చూసింది.


రాళ్ళ నడుమ నీళ్ళలా నవ్వుతున్నాడు చంద్రం.

"ఔనూ ..ఎప్పుడూ యిది నీసెంకనే వుంతాది' తొంగున్నప్పుడూ వదలవేటి దీన్ని" కంజిరాను ఈర్ష్యగా చూస్తున్నట్లు మొహం పెట్టి నవ్వుతూ అంది.

"నా కాలూసేతుల్లాగే యీ కంజిరా..."

"మరి నీ మనువైతే అప్పుడో..."

"అప్పుడైనా నరే... దీని తరువాతే ఎవరైనా.." కంజిరాను ఆప్యాయంగా నిమిరి చెప్పేడు.



సిరిమెల కళ్ళతో నవ్వి.. "ఆ అందరూ అలగే సెప్తారు - తొలితొలెత . అయింత మనువైపోతే.." అని ఛెంగున దూకి పారి పోయింది. పారిపోతూ.. తిరపతయ్య వెనగ్గ వరదలా తిరిగే గంటయ్య కళ్ళలో పడి పోయింది.'

"వదినిని బాగకొట్టి గదిలోన పెట్టేసి తలుపేస్సినారట తిండి గదిలోకే పట్టెకెల్లి యిత్తన్నారట...." కబురు తెచ్చేడు బుదగాడు చంద్రం మనసు బాధగా మూలిగింది. 'నావల్లనే కదా యిలగైంది'. అని బాధపడ్డాడు. తినీ తినక... చేసేదేమీ లేక ఉత్తరాలున్నాలేకున్నా గూడలు తిరిగేడు. కొండలు ఎక్కి దిగేడు. తను కొండల్లోకి వచ్చేముందు 'చాలీచాలని జీతానికి తోడు పాట సాయంతో... మాట మంచితనంతో కందిగింజలో... చింతపండో సంపాదించ లేకపోను' అనుకున్నాడు. గిరిజనుల బ్రతుకుల్ని చూసేక పాటను ఎలా మలుచు కోవాలో నిర్ణయించుకున్నాడు. అప్పుడు పోరాటం జరిగింది. పోరాటం ఫలితంగా నెత్తురింకిన నేలలో యిప్పుడు అభివృద్ధి పధకాల ఫలవృక్షాలున్నాయి. కానీ ఆ ఫలాలు కోదన్నలకు అందకుండా చేస్తున్నదెవరో... అనుభవిస్తున్న దెవరో అమాయక గిరిజన సోదరులకు తెలియజెప్పాలనుకున్నాడు. 'కొండ పండితే... కోᐟ నిటోడికే లాబంగానీ' అని నిరాశా నిస్పృహ ల మధ్య బ్రతుకులు వెళ్ళదీస్తున్న వారికి తన పాటతో ప్రభావితం చెయ్యాలనుకున్నాడు.... 'అమాయకుల చీకటి బ్రతుకుల్లో పాట దీపం 'కావాలి' అని ఆరాటపడ్డాడు. గిరిజనులు పాడుకునే సవర గదబ జాతాపు భాషల పాటల బాణీల్లో పాటలు కట్టేడు. జబ్బులు జ్వరాలతో మంచంపట్టి, చిల్లంగి చీటకమని ఎజ్జోడితో కానికిలు పోయిస్తే అది సరియైన పద్ధతి కాదని నచ్చజెప్పి ఆస్పత్రికి పంపించేడు...

కందుల మీద అప్పుతెచ్చి కందిపంటంతా షావుకార్ల పాలుజేసే కోదన్నలకు వారు నష్టపోతున్న విధం పాటలు పాడి.... వ్యాపారుల మోసాలను బట్టబయలు చేసేడు.బ్యాంకులకీ .... ఐ.టి.డి.ఏ ఆఫీసుకీ వెళ్ళడం చెప్పేడు.

సోదన్న, బుద, సంగమేసులతోపాటు కుర్రాళ్ళను చేరదీసి చదువు చెప్పేడు. తను కట్టిన పాటల్ని పాడి పాడటం నేర్పేడు. అనేక వ్యాపకాలతో బూదిజ్ఞాపకాల్ని అడుగున పెట్టేడు.

"సెంద్రన్నా... ఆ మేస్త్రుగాడు వూరెల్లేడు.. యీవేల అడిపాట పాడితే." గుర్తు చేసేడు సంగమేసు.

''వూర్లో రాత్రులు పాట'' పెట్టి సేన్నాలయ్యింది. "సోదన్న...బుధలు వంతపాడేరు. సరే నన్నాడు చంద్రం.

రాత్రి వీధిలో మంటపెట్టేరు.

చంద్రం కంజీరా శృతి చేసేడు.

''అయ్యలారా... అమ్మలారా... ఈ కొండల్లో... కోనల్లో... కోదన్నల చీకటి బ్రతుకుల్లో దీపాలు వెలిగించడానికి ఎందరో వీరులు తమ బ్రతుకులు బలిచేసేరు. ఒక గురువు కొండలకు వెలుగు దారి చూపించ డానికి తుపాకి గుండుకు బలైపోతే.. ఆ గుధువు తో పాటే చదువుకున్న మరో గురువు గిరిజనుల బ్రతుకుల్ని దోపిడీ చేయడానికి తయారై పోయేడు. ఆ గురువు గిరిజనులకు దారిచూపే దేముడైతే... యీ దొంగగురువు కొండను ఆవహించిన దెయ్యమై పీడించేడు.

"సదువులు సెప్పే గురువు నేననీ.. సవరగూడలో సొరబడ్డాడా సవర పిల్లనీ మనువు సేసుకుని నేనూ మాసవరోడి నన్నడా గెర్డవార ఆమెరకలన్నిటిని గడుసుతనంగా వరకట్టేడా.. ఐదు పదులు అప్పులు యిచ్చి పోడుపంటలు పోగేసాడా బడి గుంటలను ఇళ్ళకు తోలి హాస్టలు సరుకులు అందుకు న్నాడా

....... .......... ..........

అడివి నాసేతిలోన తమలపాకు అన్నాడా.
కొండనా కళ్ళకింద కండసీమ అన్నాడా
ఏకులాగ వచ్చినోడు మేకై కూకున్నాడా.

అదిగా విధంగ ఏకులాగ వచ్చినోడు మేకై....మేకల్లాంటి కోదన్నలమీదికి పులిలా తయారైపోయేడు.... జతబట్టల్తోటి మేస్త్రుగా వచ్చినోడు పట్నంలో మేడలు కట్టేడు... తన పెళ్ళి పెళ్ళానికి పుట్టిన పిల్లలకి గిరిజన సర్టిఫికేట్లు రాయించి. మంచి చదువులకి పునాదులు వేసేడు. వుంచుకున్న కొండపిల్ల సంతానాన్ని మాత్రం పొలం పనుల్లోకి పంపించేడు అమ్మలారా.. చీమలే తమ పుట్టల్లో తిష్ఠ వేసిన పాముల్ని చుట్టుముట్టి దీని పనిపడతాయి. మరి మనం మన బూᐟవుల్లో... బతుకుల్లో చొరబడితే పల్లకోగలమా.........

కదలిరండి కలిసిరండి మీరంతా ఒకటి కండి


తరతరాల దోపిడిపై తిరుగుబాటు
చెయ్యండి."

అని పాట ముగించేడు. పాట అక్కడున్న అందరినీ ఊపేసింది. పట్టికుదిపింది. పాటలో నిమగ్నమై పిల్లామేకా....ముసలీ ముతకా అందరూ చంద్రంతో పాటు చిందులేసేరు. జీలుగు మత్తులో మరింత ఉత్సాహంగా వూగేరు. పాట ఎవరిని వుద్దేశించి పాడేదో అందరికీ బోధపడింది. ఎవరికి వారే ఆలోచించేరు. ఇళ్ళకు చేరినా చెవుల్లో ఇల్లు కట్టినట్టు పాట పదేపదే హెచ్చరిస్తూనే వుంది. అందరినీ ఒక మాట మీద నిలబెట్టింది.

'తిరపతయ్యమాట మనం ఎందుకు యినాల? ఆడితోటి మనకి మాటలేల.. ఆడి బాద ఆడు పడతాడు. మనబాధ మనం పడుదుంగాని..." గూడలో కొత్త ఆలోచన మొలకెత్తింది.

ఊరిచివర చెట్టుక్రింద చిరిగిన కంజీరాను 'బాగుచేసుకుంటున్న చంద్రం అలికిడైతే చూసేడు. ఇద్దరు వ్యక్తులు... తాగి వున్నట్టున్నాడు. పల్లపోలు... కొండ సరుకు కోసం వచ్చిన వ్యాపారుల్లా లేరు.... 'ఏంకావాలి' అన్నట్టు చూసేడు.

"ఉత్తరాలు పంచుకోడానికి వచ్చినోడివి నీ పనినువ్వు సేసుకోకుండ ఊరేపకాలన్నీ.... ఏల"



"నా వ్యాపకాల గురించి అడగడానికి నువ్వేటి నా బావమరిదివా" మాట పూర్తయిందో లేదో పిడుగులా పడిందో గుద్దు చంద్రం దవడ మీద. కాలికొచ్చిన తాపు చేతికొచ్చిన గుద్దు అన్నట్టు కొట్టేరు చంద్రాన్ని. అంతా పోడుపనుల్లో... కొండల మీద వుండడంతో ఊరు నిర్మానుష్యంగా వుంది. కుక్కి మంచాల్లో ముసలాళ్ళు.... పిల్లలు తప్ప ఎవరూ లేకపోవడంతో చంద్రానికి సహాయంగా ఎవరూ రాలేకపోయేరు.

చంద్రం స్పృహ తప్పేడు.

పశువులు తోలుకుంటూ వస్తున్న సోదన్న, సంగమేశు, బుధ చూసేరు. ముఖం మీద నీళ్ళు చిలకరించి ఉపచారాలు చేసేరు.

గూడెం గోడు గోడున ఏడ్చింది. చంద్రాన్ని ఆసుపత్రికి తరలించింది. 'మరి తిరిగిరాడు' అని మురిసిపోతున్న తిరపతయ్య చెవులకి రెండు వారాలు తిరగకుండానే 'కంజీరా దరువు' సోకింది. చెవుల్లో మందుపాతర పేల్చినట్లయ్యింది.


పాట మరింత పదునెక్కింది.

పాట ఊరుదాటింది. సంతల్లో తిరిగింది. ఒక గొంతుక వంద గొంతుల్ని తోడు తెచ్చుకుంది. పిల్లకాలువలు వాగులై... వాగులు నదులై పొంగి పొర్లి ప్రవహించినట్టు... పాట కొండల్ని చుట్టివచ్చింది. కొండను కాటాలో తూచాలనుకున్న వారిని పామై వెంటాడింది.

ఆ రోజు...

కంది కొత్తల పండుగ సందడి.తుడుము డప్పు దరువులకు అనుగుణంగా 'కొంగగుంటలు' వేసే అడుగులు. జీలుగ మత్తులో వేసే చిందులు కొండల్ని హోరెత్తించేయి. చంద్రం వాళ్ళలో ఒకడై చిందులేసేడు. తనివి తీరా పాటలు పాడేడు. 'శతర్లు' పట్టి 'దుర్ల'కి వెళ్ళే గుంపుతో ప్రక్క గూడలకు చిందులేసుకుంటూ తానూ వెళ్ళి వచ్చేడు. కొండల వెనక సూర్యుడు అలిసి జారిపోతున్నప్పుడు... ధింసా నృత్యాల చిందుల్లో లేచిన ఎర్రెర్రని ధూళిలోంచి మసక మసగ్గా కనిపిస్తూ మెల్లగా వచ్చి ఆగిందో జీపు. జీపులోంచి తిరపతయ్య దిగేడు. అతని వెనక పోలీసులు యిద్దరు.

తుడుము డప్పుల దరువులు ఆగేయి చిందులూ ఆగేయి. గాలి వీచడం మరిచిపోయింది. చంద్రాన్ని... మరో యిద్దరు కుర్రాళ్ళని మోసుకుని జీపు ధూళిలో కనుమరుగైంది. ఊరు శోకంలో మునిగిపోయింది. ఊరంతా పయనమైంది. పసిపిల్లల్ని చంకనేసుకుని ఆడాళ్ళు కదిలేరు. గోచీ గుడ్డల్లో గుంటలు కదిలేరు. అలా వెళ్ళిన వారు తిరిగి చంద్రంతో తిరిగొచ్చేరు. సరిగా నడవలేక పోతున్న చంద్రానికి ఆసరాగా సోదన్న... సంగమేసు యిరువైపులా నిలిచేరు పాటకు వంతల్లా.




గూడ జనాల అనురాగంతో నీరు తగిలిన మొక్కలా తేరుకున్నాడు చంద్రం. పాటల కొత్త చివుళ్ళు తొడిగేడు ఎర్రెర్రగా.

మహోన్నతంగా నిలబడ్డ కొండల మీంచి.... ఏపుగా దట్టంగా విస్తరించిన మహావృక్షాల మీదుగా చినుకుల్తో కలిసి చిక్కగా జారుతోంది చీకటి. పాట ముగిసేక రాటకు వేలాడ దీసిన కంజీరాలా వుంది ఊరు. వేయి రాగాలు ఆలపించి అలసిన పిల్లంగోవిలా వుంది ఊరు. పోడు పనుల్లో పగలంతా కలిసి జీలుగు మత్తులో జోగుతోంది ఊరు.

దూరంగా కొండమీంచి ఏదో జంతువు అరుస్తోంది.

సీసాదీపం ముందు చదువుకుంటున్న చంద్ర తడిక కదిలిన చప్పుడై లేచి దీపం చేత్తోపట్టుకుని బయటకి చూసేడు. నీడలా ఓ స్త్రీ ఆకారం. సన్నగా గాజుల చప్పుడు. ఏదో రహస్యంగా చెబుతున్నట్టు. చెట్ల సందుల్లో గాలి గుసగుసలు.

"ఎవరూ..."

"నాను.... "

"దీపం వెలుగులో తేరిపార చూసేడు.

వెలుగు నీడలనడుమ ఇరవయ్యేళ్ళ పరువం పురులు విప్పుకుంటున్నట్టుంది.

"సిరిమెలా....నువ్వా.... యీ చీకట్లబడి యింతేలప్పుడు.... !"

"....యిప్పుడు సీకటని బయపడితే రేపు మనకు...సీకటే...'''

"నువ్వంటున్నది నాకేమీ అర్థం కావడం లేదు. అయినా యిలా రావడం బాగులేదు. వెళ్ళు.... ఏదైనా ఉదయం మాట్లాడుకుందుం గానీ"

"పెండిల్దాకా ఆగితే పీకలు తెగిపోతాయి. పద...ఎటైనా ఎలిపోదుంగాని."

" లేచిపోవడమా...... నేను పిరికోడిని, దొంగోడిని అనిపించుకోవాలనా... రేపు మన గూడ పెద్దలందరి ముందు నీ రెక్కబట్టి....నా ఇంట్లో పెడతాను. తప్పు చెల్లించనుంటే చెల్లించుకుంటాను పెద్దలు చెప్పినట్టు."

"నువ్వలగంతన్నావు గానీ.... అదంత సులువనుకుంతన్నావేటి ? ఎలుగుబంటి నేస్తం కాదు. పెద్దపులి సుట్టంవూ కాదు... మా బావమన మనువుకి ఒప్పుకోడు. ఎందుకొచ్చిన బాద... సుబ్బరంగా ఎలిపోదుం పద...నే పోతే... ఆ "మొగనాల గాటీ.. కత నీకు తెలీదేటి ఆలూమన్లాగే ఎనకాముందులాడితే........."

చంద్రం కళ్ళలోకి భయం గా చూసింది... చెప్పడంసగంలో ఆపి. చంద్రం చిన్నగా నవ్వి అన్నాడు'' నువ్వేగదా అన్నావు కొండలకీ...కొండల్లపుట్టిన కొండోలకీ బయమేటని..... ఏం భయం కాదు వెళ్ళు..."నవ్వి పంపించేశాడు.

సిరిమెల కళ్ళనుండి కన్నీటి బొట్లు జలజలారాలి పడ్డాయి సంతలో కొన్న పూసలపేరు పూసలు తెగిపడ్డట్టు.

వెనుదిరిగి చీకట్లో కలిసిపోయింది.

మొగనాల ఘాటి మీంచి సూర్యుడు తొంగిచూసేసమయానికి గూడెం గూడెమంతా గెడ్డ ఒడ్డునే వుంది. ఏడుపు మొరలైవుంది.


ఉదయం పక్షులు కిలకిలలాడలేదు. విలవిలలాడేయి.

వాగు గలగలా ప్రవహించలేదు. వలవలాకన్నీరై పొంగింది.

చెట్ల ఆకుల మీంచి అశ్రువులై రాలేయి నీటి బిందువులు గాలి విషాదమై వీచింది.

"సెంద్రన్నా........."

సోదన్న అరుపుకి దిక్కులు అదిరిపో




యేయి. వాడి చేతిలోని పిల్లంగోవి ఎర్రని రక్తంలో జారి రంధ్రాలు నెత్తురు స్రవించే గాయాలైనాయి. నెత్తుటి మరకల నడుమ చిరిగి లొత్తలు పడిన కంజీరా.

"ప్రతిగొంతున జనం పాట చిగురు లేస్తది
చిగురు చూస్తే దోపిడికి చెమటపడతది
రక్తంతో తడిసెనా, నేల రాజుకుంటది
రాజుకున్న 'గుండెలోళ్ళ' రాజ్యమొస్తది

పాటలు పాటలుగా రక్తం. పాయలు పాయలుగారక్తం. పచ్చని గడ్డిపరకల్నీ ఎర్రెర్రగా మార్చిన రక్తం.

అడివంతా వెదికేరు. కొండలన్నీ తిరిగేరు. చంద్రంశవం దొరకలేదు.

అదుగో ఆ గెడ్డ ఒడ్డున 'చంద్రం' నెత్తురుతో తడిసిన నేలలో సిరిమెల నాటిన సరుగుడు మొక్క ఏపుగా పెరిగి.... నేల తంత్రుల్ని మీటినట్లు..... వేనవేల రాగాలతో వినీలాకాశం వేపు కొమ్మల చేతుల్ని చాస్తూ పెరిగిపోతోంది.

అదిగాచెట్టే రాగాల చెట్టు...
గూడెపోళ్ళ రాగాల చెట్టు

ఆ చెట్టు మొక్కగా మూరెడు ఎదగకముందే... తిరుపతయ్య ఊరోళ్ళ నిరసనను తట్టుకోలేక..తేనెటీగల్లై చుట్టు ముట్టిన పాటల పోట్లు భరించలేక..... ఎటో వెళ్ళిపోయేడు. అలా వెళ్ళిన తిరపతయ్యను అయిన వాళ్ళెవరూ ఆదరించనూలేదు. ఇప్పుడెక్కడున్నాడో ఆచూకి తీయనూలేదు.

పిల్లంగోని పాట ఆపి అయువకుడు సోదన్న ఆమె వేపు చూసేడు ఎత్తుగా వున్న ఆమె పొట్టను చూపులతో నిమిరేడు. ఆమె సిరిమెల.

"ఉత్తరాలబావూ..... ఏకూన పుట్టినా నీ పేరే పెట్టుకుంతాం" సిరిమెల కళ్ళు అర్ద్రమయ్యేయి. తడిగా తళతళ మెరిసేయి.

"సెంద్రన్నా ఆపిల్లడికి పాలు కాదు, పాటలు పోసి పెంచుతాం". చెట్టును కౌగలించుకున్నాడు సోదన్న. చెట్టుపైన రెండు గువ్వలు సిరిమెల, సోదన్నలను చూసి కువకువలాడేయి.

"సూరన్న సెంద్రన్న సూసినంత కాలము
నేల మీద గాలి తల్లి నవ్వినంత కాలము
పేదోడి పెదవి మీద పాట వుంటది...
కూలన్నల కెపుడూ అది తోడు వుంటది'

పాటను శ్వాసిస్తూనే వుంది చెట్టు
పాటల్ని చిగురిస్తూనే వుంది'చెట్టు
గూడెపోళ్ళ గుండెల అనురాగాల చెట్టు
అరాగాల చెట్టు.

☆ ☆ ☆

ఉత్తరాంధ్ర ముఖ్యంగా విజయనగరం జిల్లా....లో పల్లెల్లో.... 'సరుగుడు' చెట్టును.... 'రాగాలచెట్టు' అని వ్యవహరిస్తారు.

☆

